ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

మంగళవారం 18 నవంబరు 2025

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

- 22 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు
- వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 22 నుంచి రాష్ట్రంలో పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలో ఈ ఏడాది అక్టోబరు 16న నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యాయి. అంతకు ముందు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రరూపం దాల్చింది. వీటి ప్రభావంతో కోస్తా తీర జిల్లాల్లో దాదాపు వారం రోజులపాటు ఎడతెరపిలేకుండా వర్షాలు కురిసాయి. అలాగే సముద్రంలో గాలుల వేగం పెరగడంతో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో వేల సంఖ్యలో పడవలు తీరానికే పరిమితమయ్యాయి.



సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం ఆదివారం పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తోంది. ఇందువల్ల డెల్టా, కోస్తా జిల్లాల్లో మళ్లీ ఆదివారం నుండి వర్షాలు ఊపందుకున్నాయి. అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశముందని, దీని ప్రభావంతో వచ్చే శనివారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా వుండగా, చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం, మైలాడుదురై, నాగపగట్నం, తిరువారూర్, కడలూరు, విల్లుపురం, తంజావూరు, పుదుకోట, తిరునల్వేలి, కన్నియాకుమారి ప్రాంతాల్లో సోమవారం ఉదయం మోస్తరు వర్షాలు కురిశాయి. నగరంలో అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నాయి. సముద్రతీర జిల్లాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆ ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.. అలాగే మైలాడుదురై, తిరువారూర్, నాగపట్నం జిల్లాల నుండి సముద్రంలో చేపలవేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది.

తూత్తుకుడి, నాగపట్టినంలో చేపలవేటపై నిషేధం

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో సముద్ర తీర ప్రాంతాల్లో పెనుగాలులు వీస్తుండటంతో తూత్తుకుడి, నాగపట్టినం, కారైక్కాల్ ప్రాంతాల మత్స్యకారులు చేపలవేటకు వెళ్ళకుండా మత్స్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గత మూడు రోజులుగా చేపల వేటపై ఆంక్షలు కొనసాగుతుండటంతో ఆ ప్రాంతాల జాలర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో చేపలవేటపై నిషేధం అమలు చేస్తున్నట్లు అధికారులు వారికి వివరణ ఇచ్చారు. ఇదే విధంగా రామేశ్వరం, పాంబన్ జిల్లాల్లోనూ మరపడవల జాలర్లు సోమవారం చేపలవేటకు వెళ్లలేదు.



నాగపట్టిణంలో తీరానికే పరిమితమైన పడవలు

బాబోయ్ బాంబులు

- ఆగంతకుల బెదిరింపులతో హడలెత్తిపోతున్న నగరం
- తనిఖీలతో భద్రతా బలగాల బిజీ
- అడ్డుకట్ట కోసం తలలు పట్టుకుంటున్న పోలీసులు



చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆగంతకుల బాంబు హెచ్చరికలతో నగరం వణికిపోతోంది. మరీ ముఖ్యంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ బెదిరింపులతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ అజ్ఞాత వ్యక్తుల హెచ్చరికలతో బాంబుల కోసం భద్రతా బలగాలు తీవ్రంగా శ్రమించాల్సివస్తోంది. ఈ ఉత్తుత్తి బెదిరింపులను అరికట్టడమెలా అన్నదానిపై పోలీస్ శాఖ తలపట్టుకుంటోంది. ఏ క్షణంలో ఏ ఇంట్లో బాంబు ఉందేని బెదిరింపు వస్తుందో? ఏ నిమిషంలో ఎటువైపు పరిగెత్తాలో అర్థం గాక పోలీస్‌శాఖ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్న వారి కోసం తీవ్రంగా గాలిస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాసం, నటులు అజిత్, అరవింద్‌సామి నివాసాలు సహా పలు ప్రాంతాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. సోమవారం డీజీపీ కార్యాలయానికి బాంబు బెదిరింపు ఈ మెయిల్ రావటంతో ఆయా ప్రాంతాల పోలీసులు అప్రమత్తమై బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్ళి తనిఖీలు జరిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నివాసం, బీజేపీ నేత నారాయణన్ తిరుపతి, నటులు అజిత్, అరవింద్‌సామి, సంగీత దర్శకుడు గంగై అమరన్, నటుడు లివింగ్‌స్టన్, గాయకుడు ఎస్పీ చరణ్, రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షుడు దిండుగల్ లియోని, సినీ దర్శకుడు ఏఆర్ మురుగదాస్, చెస్ క్రీడాకారుడు ప్రజ్ఞానంద, నటి ఖుష్బూ, జయరంజన్ తదితరుల నివాసాల్లో బాంబులున్నాయని, అవి కాసేపట్లో పేలనున్నాయని ఈమెయిల్ సందేశం పంపారు. ఇదే విధంగా నగరంలోని సీఆర్పీఎఫ్ కార్యాలయంలో బాంబులు పేలుతాయని హెచ్చరికలు వచ్చాయి.. దీంతో ఆయా ప్రాంతాల పోలీసులు వెళ్ళి ముమ్మరంగా తనిఖీలు జరిపారు. చివరకు ఆ బెదిరింపులన్నీ ఉత్తుత్తి బాంబు బెదిరింపులని నిర్ధారణ కావటంతో అప్పటి దాకా ఊపిరి బిగబట్టిన పోలీసులు ఊరట పొందారు.

తాజా ఘటనలతో ఆందోళన

ఇటీవల ఢిల్లీలో కారు పేలుడు సంభవించడం, పలు చోట్ల తీవ్రవాద సానుభూతిపరులు అరెస్టవుతున్న వార్తల నేపథ్యంలో బాంబు బెదిరింపులు నగర వాసుల్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. పోలీసులు కూడా ఈ అజ్ఞాత వ్యక్తుల హెచ్చరికలను తేలిగ్గా తీసుకోలేకపోతున్నారు. అవి నిజమైతే ప్రాణ నష్టం సంభవిస్తుందన్న అనుమానంతో గట్టిగానే శ్రమిస్తున్నారు. అయితే అది ఉత్తుత్తి బెదిరింపేనని తేలడంతో వారు నిట్టూరుస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ఎలా తీసుకోవాలేక అర్థంగాక పోలీసు వర్గాలు సతమతమైపోతున్నాయి. ఈ బెదిరింపులకు పాల్పడుతున్నది ఒకరేనా, లేక వేర్వేరు వ్యక్తులా అన్నది తేలడం లేదని, దీనిపై ప్రత్యేక బృందాలు తీవ్రంగా దర్యాప్తు జరుపుతున్నా పట్టుకోలేకపోతున్నామని పోలీస్‌వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే త్వరలోనే అడ్డుకట్ట వేస్తామని, ఈ బెదిరింపులకు ఫుల్‌స్టాప్ పెడతామని ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

సకల సదుపాయాలతో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ కార్యాలయం





వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెగ్యులేటరీ అథారిటీ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్‌లో రూ.97 కోట్లతో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ కోసం నిర్మించిన కార్యాలయ భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ఉదయం ప్రారంభించారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అన్నానగర్ ప్రాంతంలో ఉన్న భవనాన్ని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ సంస్థ రూ.77.60 కోట్లకు కొనుగోలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ భవనంలో రూ.19.49 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగుపరచింది. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చెన్నై సచివాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ భవన సముదాయాన్ని స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ భవన సముదాయంలో సమాచార కేంద్రం, పార్కింగ్, విజిటర్స్ హాల్, వెయిటింగ్ హాల్, ఏసీ సదుపాయం కూడా ఉన్నాయని సీఎం స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ఛైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.దురైసామి, రాష్ట్ర కట్టడ, భవనాల క్రమబద్ధీకరణ సంస్థ ఛైర్మన్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, గృహనిర్మాణ, నగరాభివృద్ధి సంస్థ అదనపు ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉష, కార్యదర్శి అపూర్వ, సభ్యులు ఎల్.సుబ్రమణియన్, డి.జగన్నాథన్, న్యాయవాది ఎం.కృష్ణమూర్తి, సుకుమార్ చిట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలనిచ్చిన వైద్యపథకం

గత నాలుగేళ్ల డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన ప్రజల వద్దకే వైద్యం పథకం సత్ఫలితాలనిచ్చిందని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో ఓ సందేశం పొందుపరిచారు. సుమారు 2.5 కోట్ల మందికి నాణ్యమైన వైద్యం అందించి, వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసిన ప్రజారోగ్యశాఖను, ఆ శాఖకు మంత్రిగా ఉన్న ఎం.సుబ్రమణ్యంను మనసారా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇంటికే పరిమితమైన వృద్ధులు కూడా లబ్ధిపొందారిని ఆయన పేర్కొన్నారు.

హైకోర్టు స్టేతో 14 వర్సిటీలకు వీసీల్లేరు

- తక్షణం విచారణ చేపట్టండి
- సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వినతి
- రాష్ట్రపతి అధికారాల పిటిషన్‌పై తీర్పు తరువాతే ఈ వ్యవహారం
- కేంద్ర ప్రభుత్వం అభ్యర్థన
- తదుపరి విచారణ 2కు వాయిదా



చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో వైస్‌ఛాన్స్‌లర్లను నియమించే చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం వాదనల్ని ఆలకించకుండానే హైకోర్టు మధ్యంతర స్టే విధించిందని, ఈ కారణంగా రాష్ట్రంలోని 14 యూనివర్శిటీలకు వీసీలు లేరని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. అందువల్ల తమ అప్పీలు పిటిషన్‌పై వెంటనే విచారణ జరపాలని అభ్యర్థించింది. అయితే రాష్ట్రపతి అధికారాల పిటిషన్‌పై తీర్పు తరువాత ఈ పిటిషన్‌పై విచారణ జరపాలని కేంద్రప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఇరుతరపు వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. అసెంబ్లీలో తీర్మాణించిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారంటూ రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. తన ప్రత్యేక అధికారాలు వినియోగించి 10 బిల్లులకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అనంతరం, వీసీల నియామక బిల్లులపై దాఖలైన కేసును అత్యవసరంగా విచారించిన మద్రాసు హైకోర్టు.. వీసీల నియామక చట్టంపై మధ్యంతర స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపుతట్టింది. ఈ అప్పీలు పిటిషన్‌పై సోమవారం విచారణ జరగ్గా.. కేంద్రప్రభుత్వం తరఫున సొలిజిటర్ జనరల్ తుషార్ మెహతా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, పి.విల్సన్ హాజరై వాదనలు వినిపించారు.

విద్యతో జ్ఞాన సముపార్జన

- మంత్రి దురైమురుగన్



తిరువలంలో లైబ్రరీ ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రపంచ జ్ఞానం సమకూరుతుందని జలవనరుల శాఖ మంత్రి దురై మురుగన్ తెలిపారు. కాట్పాడి సమీపంలో బ్రహ్మపురంలో రూ.11 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను సోమవారం మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. అనంతరం, అరుంపరుది గ్రామంలో రూ.11 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్, తిరువలంలో లైబ్రరీ, వ్యాయామశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తన నియోజకవర్గంతో పాటు జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో స్టాలిన్ నేతృత్వంలో ద్రావిడ మోడల్ ప్రభుత్వం మళ్లీ అధికారం చేపట్టేలా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీ కదిర్ ఆనంద్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

20న కొత్త పార్టీ ప్రారంభిస్తా

- మల్లై సత్య ప్రకటన

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ఎండీఎంకే నుంచి వైదొలగిన మల్లై సత్యా ప్రకటించారు. సోమవారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండీఎంకేలో వైగో, తనయుడు దురై వైగో మాత్రమే పెత్తనం చెలాయిస్తున్నారని, తన లాంటి సామాన్య నాయకులకు గౌరవం ఉండదన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వైగో పాదయాత్ర చేయడానికి సిద్ధమవుతుంటే ఆయన తనయుడు దురై వైగో సిగరెట్ కంపెనీలను నడుపుతున్నాడని విమర్శించారు. తండ్రీ కొడకుల మధ్య విరుద్ధభావాలుంటే పార్టీ ఎలా బాగుపడగలదని మల్లై సత్యా ప్రశ్నించారు.

ఎడప్పాడితో జీకే వాసన్ భేటీ



చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ను తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ సోమవారం ఉదయం కలుసుకున్నారు. ఈ భేటీ సేలంలో ఉన్న ఈపీఎస్ నివాసంలో జరిగింది. ఈ సమావేశానంతరం వాసన్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయేకు నాయకత్వం వహిస్తున్న ఈపీఎస్‌తో చర్చలు జరిపేందుకు కలుసుకున్నానని చెప్పారు. రాష్ట్రంలో అతి పెద్ద రాజకీయ పార్టీ అన్నాడీఎంకే మాత్రమేనని, ఇదే విధంగా కేంద్ర స్థాయిలో అతి పెద్ద పార్టీ బీజేపీ అని, ఆ రెండు పార్టీలు అసెంబ్లీ ఎన్నికల కోసం బలమైన పొత్తు కుదుర్చుకున్నాయని తెలిపారు. ఈ కూటమి వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారం చేజిక్కించుకుంటుందన్నారు. ఎన్డీయేలో మరిన్ని పార్టీలు చేరే అవకాశాలున్నాయని ఆయన చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా అయ్యప్ప దీక్షలు ప్రారంభం



తిరుచెందూరు ఆలయంలో అయ్యప్ప భక్తులకు మాలధారణ చేస్తున్న గురుస్వామి

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళ కార్తీక మాసం ప్రారంభోత్సవం, కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని సుప్రసిద్ధ ఆలయాల్లో శబరిమలై వెళ్లే భక్తులు మాలాధారణ చేశారు. మహాలింగపురం, అన్నానగర్ టవర్ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయాల్లో సోమవారం వేకువజామునే వేలాదిమంది భక్తులు మాలాధారణ కోసం బారులు తీరారు. శబరిమలై ఆలయంలో ప్రతియేటా కార్తీకమాస మండల పూజల కోసం ఆలయ ప్రధాన ద్వారాన్ని తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మండల పూజల సమయంలో అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు దేశవిదేశాల నుండి వేల సంఖ్యలో భక్తులు ఇరుముడులు కట్టుకుని శబరిమలై యాత్రకు బయలుదేరుతారు.

రాజధాని నగరంలో...

నగరంలోని నుంగంబాక్కం సమీపం మహాలింగపురం అయ్యప్ప ఆలయంలో సోమవారం వేకువజాము ఐదు గంటలకే వేల సంఖ్యలో అయ్యప్ప భక్తులు మాలా ధారణ కోసం క్యూలైన్లలో నిలిచారు. ఆలయంలో మూలవిరాట్టు ఎదుట పూజించిన తులసిమాలలను గురుస్వామి భక్తులకు వేశారు. ఇదే విధంగా అన్నానగర్ టవర్ సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో కూడా అయ్యప్ప భక్తులు మాలాధారణ కోసం బారులు తీరారు. న్యూవాషర్‌మెన్‌పేట తిరువొత్తియూరు హైరోడ్డులోని అయ్యప్పసామి ఆలయం వద్ద కూడా భక్తులు మాల ధరించారు.

తిరుచెందూరులో...

తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం శబరిమలకు వెళ్లే భక్తులు వ్రతమాల ధరించారు. వీరందరికి ఆలయ ప్రాంగణంలోని షణ్ముఖవిలాస మండపం వద్ద గురుస్వామి మాల వేశారు. తిరుచెందూరు మణికంఠన్ పాదయాత్ర బృందానికి చెందిన గురుస్వామి అమెరికా శీనివాస శర్మ, అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం తూత్తుకుడి జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు కృష్ణమూర్తిగురుసామి, పన్నీర్‌సెల్వం గురుసామి, అర్చకులు అయ్యప్ప భక్తులకు మాలాధారణ చేశారు.





బాలుడికి మాలవేస్తున్న గురుస్వామి - అన్నానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారణ కోసం వేచి ఉన్న భక్తులు



విరాలిమలైలో...

తిరుచ్చి జిల్లా విరాలిమలైలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ఉదయం శబరిమలకు వెళ్లే వేలాదిమంది భక్తులు మాలాధారణ చేశారు. కార్తీక మాసం ఆరంభం సందర్భంగా పర్వతాలయం, వన్నిమరం ఆలయాల్లో స్వామివారికి అలంకరణ సేవల, అభిషేక, ఆరాధనలు, మహాదీపారాధన కావించారు. ముందుగా వన్నిమరం అయ్యప్ప ఆలయంలో యాగశాల పూజలు జరిపిన మీదట ధ్వజస్తంభంలో పతాకావిష్కరణ చేశారు. ఆ తర్వాత శబరిమలై యాత్రకు వెళ్ళనున్న భక్తులకు గురుస్వాములు మాలాధారణ చేయించారు.

విరాలిమలై ఆలయం వద్ద మాల ధరిస్తున్న అయ్యప్ప భక్తులు

సమాచార దర్శిని

30న సామూహిక భగవద్గీత పారాయణం

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకటరామన్ వీధి సమీపంలోని పప్పిచెట్టి రాఘవయ్యచెట్టి ఛారిటీస్ (పీఆర్సీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ గీతా జయంతి సందర్భంగా సామూహిక భగవద్గీత పారాయణం కార్యక్రమం జరగనుంది. సాధన పేరుతో సాయంత్రం 4గంటలకు పీఆర్సీ సెంటినరీ హాలులో శ్రీమన్నారాయణుడికి ప్రత్యేక పూజలు, భగవద్గీత విశిష్టతపై ఉపన్యాసం, సామూహిక పారాయణ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పీఆర్సీసీ అధ్యక్షుడు కోట సుధాకర్, ట్రస్టీలు పిలుపునిచ్చారు.

6న ఏకాంబరనాథాలయ స్వర్ణ రథోత్సవం

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో ప్రసిద్ధిచెందిన ఏకాంబరనాథ స్వామి ఆలయ స్వర్ణ రథోత్సవం డిసెంబరు 6వ తేది జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కుంభాభిషేకం 17 ఏళ్ల అనంతరం డిసెంబరు 6వ తేది జరుగనుంది. కుంభాభిషేకం సందర్భంగా స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొంగల్ సందర్భంగా ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా నగరం నుంచి దక్షిణ జిల్లాలు సహా పలు ప్రాంతాలకు 150 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. గత ఏడాది పొంగల్‌కు చెన్నై నుంచి దక్షిణ జిల్లాలు, కోవై తదితర ప్రాంతాలకు 150 ప్రత్యేక రైళ్లు నడపగా, సుమారు 2.50 లక్షల మంది ప్రయాణించారు. ఈ క్రమంలో, వచ్చే ఏడాది జనవరి 15వ తేది పొంగల్ సందర్భంగా డిసెంబరు 15 నుంచి 150 ప్రత్యేక రైళ్లు నడపాలని నిర్ణయించారు. అలాగే, పండుగ తరువాత తిరిగి వచ్చేవారి సౌకర్యార్థం జనవరి 16వ తేది వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.

అయ్యప్ప భక్తుల కోసం సమాచార కేంద్రాలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే రాష్ట్రానికి చెందిన అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం 24 గంటల సమాచార కేంద్రాలు ఏర్పాటయ్యాయి. శబరిమల అయ్యప్పస్వామి ఆలయ మండల పూజలు సోమవారం నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు, మహా దీప పూజలు డిసెంబరు 30 నుంచి జనవరి 19వ తేదీ వరకు జరుగనున్నాయి. శబరిమల వెళ్లే రాష్ట్రానికి చెందిన అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ తరఫున, ఆ శాఖ కమిషనర్ కార్యాలయం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కలియకావిలై, కేరళ రాష్ట్రం శబరిమలైలో 24 గంటలు పనిచేసే సేవా కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాలు వచ్చే సంవత్సరం జనవరి 20వ తేదీ వరకు పనిచేయనున్నాయి. నగరంలోని కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని 1800 425 1757 అనే టోల్ ఫ్రీ నెంబరులో, కలియకావిలై కేంద్రాన్ని 9488073779, 9486270443, 9442872911 అనే నెంబరు సంప్రదించాలని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్‌లో 'క్యాట్' మోడల్ పరీక్షలు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'క్యాట్' ఎలా ఎదుర్కోవాలో వివరించేలా ఆన్‌లైన్‌లో మోడల్ పరీక్ష నిర్వహించనున్నారు. దేశంలోని ఐఐఎం వంటి ప్రముఖ విద్యా సంస్థల్లో పోస్ట్ గ్యాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి 'క్యాట్' (కామన్ అడ్మిషన్ టెస్ట్)లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ ఏడాది కాట్ పరీక్ష ఈ నెల 30వ తేదీ దేశవ్యాప్తంగా 170 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 12న హాల్ టిక్కెట్లు విడుదల చేశారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో మోడల్ పరీక్షలు నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు https://iicat.ac.in అనే వెబ్‌సైట్ నుంచి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని ఈ ఏడాది క్యాట్ పరీక్షలు నిర్వహిస్తున్న ఐఐఎం కోజికోడ్ ఒక ప్రకటనలో తెలిపింది.

ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం స్వల్పకాలిక కోర్సులు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యా శాఖ 'స్వయం' పథకం కింద సమాచార సాంకేతికత సహా వివిధ నైపుణ్యాలతో ఉచిత ఆన్‌లైన్ స్వల్పకాలిక కోర్సులు అందిస్తోంది. ఆ ప్రకారం, 'స్వయం' పథకంలో ఇంజనీరింగ్ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత 'ఆన్‌లైన్' సర్టిఫికెట్ కోర్సులు పరిచయం చేశారు. డేటా ఆర్కిటెక్చర్, ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్, డేటా బేస్ మేనేజ్‌మెంట్ సహా తొమ్మిది రకాల స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నారు. ఆ కోర్సులను, అన్నా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఆన్‌లైన్‌లో బోధించనున్నారు. వాటిలో, కొన్ని కోర్సులు తమిళ మీడియంలో అందిస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు https://swayam.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మహాబలిపురం నృత్యోత్సవానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో వచ్చే నెల జరుగనున్న 'ఇండియన్ డాన్స్ ఫెస్టివల్'లో పాల్గొనేందుకు సంప్రదాయ, జానపద నృత్యకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పర్యాటకశాఖ పర్యాటకులను ఆకర్షించేలా ప్రతి ఏడాది మహాబలిపురంలో నృత్యోత్సవం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు వారి వారి రాష్ట్రాల సంప్రదాయ సంగీతం, నృత్యం తదితర కళా రూపాలను ప్రదర్శిస్తుంటారు. ప్రతి ఏడాదీ డిసెంబరు మూడో వారంలో ప్రారంభమయ్యే ఈ వేడుకలు జనవరి రెండో వారం వరకు కొనసాగుతాయి. ఈ వేడుకల్లో భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, ఒడిస్సీ, మోహినియాట్టం, గుర్రాలాట, మయిలాట్టం వంటి వివిధ సంప్రదాయ, జానపద కళా ప్రదర్శనలుంటాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న కళాకారులు dotdepartment@ gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాకు తమ వివరాలు పంపించాలి. అలాగే, వాలాజా రోడ్డులోని పర్యాటక శాఖ కార్యాలయంలో డిసెంబరు 5వ తేది సాయంత్రం 5.45 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

'మాస్' అధ్యక్షుడిగా కొల్లిరాజు


నూతన కార్యవర్గంతో డాక్టర్ కొల్లిరాజు

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'మద్రాస్ ఆది ఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం' (మాస్) అధ్యక్షుడిగా కేంద్ర మాజీ ప్రభుత్వాధికారి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కొల్లిరాజు ఎంపికయ్యారు. ఎగ్మూర్‌లో ఆదివారం జరిగిన మాస్ వార్షిక సర్వ సభ్యసమావేశం 2025-2027 వరకు మాస్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసేందుకు తీర్మానించింది. మాస్ సలహాదారుడు, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈ సమావేశంలో డాక్టర్ కొల్లిరాజు మూడోసారి మాస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా బీవీ అనిల్‌కుమార్, పి.పాల్ కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసులు, గౌరవ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎ.హజరత్తయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.తిరుపతయ్య, కేపీ.రావు, సీహెచ్ నాగార్జునరావు, కోశాధికారిగా ఎం.వీరయ్య, ఉప కోశాధికారిగా వి.దీనదయాళన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె.రవిచంద్రన్, సి.తిరువళ్లూరు, వై.రాజశేఖర్ బెనర్జీ, యజ్ఞ శేఖర్, కె.అన్నపూర్ణ, ఏఎన్ రాజేష్, అడ్వైజర్లుగా కూనూరు మాధవరావు, గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ చంద్రమోహన్, ఎ.జేసన్, ప్యాట్రన్స్‌గా కె.అంబుజా గోపాలకృష్ణ, జి.ఆల్బర్ట్‌రావులు ఎంపికయ్యారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాస్ వ్యవస్థాపకులు కేజీ గోపాలకృష్ణ చిత్రపటాలకు నిర్వాహకులతో కలిసి కొల్లిరాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లిరాజు మాట్లాడుతూ, మాస్ నిర్వాహకుల సహాయ సహకారాలతో సంస్థను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషిచేస్తానన్నారు. పాల్ కొండయ్య వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

రూ.2.50 కోట్ల మోసం... మాజీ ఉపకులపతిపై కేసు నమోదు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల పేరిట రూ.2.50 కోట్ల మోసానికి పాల్పడిన వ్యవహారంలో, చెన్నై అన్నా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి కళానిధి, ఆయన భార్య రాజ్యలక్ష్మిపై పోలీసులు కేసు నమోదుచేశారు 2019లో చెన్నై అన్నా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా కళానిధి వ్యవహరించారు. ఆయన, చెంగల్పట్టు జిల్లా పయనూరుకు చెందిన ధనశేఖర్, ఆయన బంధువుకు ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామని రూ.2.50 కోట్లు తీసుకున్నట్లు సమాచారం. ఉద్యోగం కల్పించకపోగా డబ్బులు కూడా తిరిగివ్వకపోవడంతో సైదాపేట కోర్టులో ధనశేఖర్ పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసు విచారించిన కోర్టు కళానిధి, ఆయన భార్య రాజ్యలక్ష్మిపై కేసు నమోదుచేసి చర్యలు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసింది. మైలాపూర్ పోలీసులు, కళానిధి, రాజ్యలక్ష్మిలపై కేసు నమోదు చేశారు.

21న పరమకుడి అత్యాచారం కేసు తీర్పు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పరమకుడి విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో ఈ నెల 21న తీర్పు ప్రకటించనున్నట్లు శ్రీవిల్లిపుత్తూర్ పోక్సో న్యాయస్థానం తెలిపింది. పరమకుడిలోని పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిందనే ఫిర్యాదుతో పరమకుడి మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో గత ఏడాది మార్చిలో మాజీ అన్నాడీఎంకే నేత పరమకుడి మున్సిపల్ కౌన్సిలర్ శిఖామణి, మరతమిళర్ సేవా సంస్థ నిర్వాహకులు పుదుమలర్ ప్రభాకర్, జౌళి దుకాణ యజమాని రాజా మహ్మద్, ఏజెంట్‌గా వ్యవహరించిన అన్నలక్ష్మి ఉమ, కమల్‌విళి తదితరులను అరెస్ట్ చేశారు. ఈ కేసు సీబీసీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసు విచారణ రామనాథపురం జిల్లా ఫాస్ట్ ట్రాక్ మహిళా కోర్టులో జరుగుతోంది. ఈ కేసులో శిఖామణి, అన్నలక్ష్మి ఉమ, కమల్‌విళి తదితర నలుగురిపై మరో ఛార్జిషీటు మొత్తం రెండు ఛార్జిషీట్లు దాఖలుచేశారు. ఈ కేసు విచారణ శ్రీవిల్లిపుత్తూర్ పోక్సో కోర్టుకు మార్చిన హైకోర్టు, ఐదు నెలల్లో విచారణ ముగించాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులతో శ్రీవిల్లిపుత్తూర్ కోర్టు అక్టోబరు నుంచి కేసు విచారణ జరుపుతోంది. ఈ కేసు లో 45 మంది సాక్ష్యులను విచారించగా, ఇరు తరపు వాదనలు పూర్తయ్యాయి. ఈ కేసు సోమవారం మళ్లీ విచారణకు వచ్చిన నేపథ్యంలో, నేరారోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఈ నెల 21న తీర్పు వెలువరించనున్నట్లు న్యాయమూర్తి పుష్పరాణి ప్రకటించి, కేసు వాయిదావేశారు.

మైనర్ కుమార్తె వివాహాన్ని అడ్డుకున్న తల్లి

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగైయూర్‌లో 14 ఏళ్ల కుమార్తెకు జరుగబోతున్న వివాహాన్ని పోలీసుల సాయంతో తల్లి అడ్డుకుంది. కొడుంగైయూర్‌కు చెందిన రాజా-మలర్ దంపతులకు 14 ఏళ్ల కుమార్తె ఉంది. భార్యాభర్తల మధ్య విభేధాల కారణంగా మలర్ అతడి నుంచి వేరుగా నివసిస్తుండగా, కుమార్తె తండ్రితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో, రాజా తన 14 ఏళ్ల కుమార్తెకు, రెండో భార్య సంగీత బంధువు మురుగన్‌తో వివాహం జరిపేందుకు నిర్ణయించాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లి మలర్, కుమార్తె బాల్యవివాహాన్ని అడ్డుకోవాలని ఆదివారం ఎంకేబీ నగర్ మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చెన్నై జిల్లా పిల్లల సంక్షేమ అధికారి నేతృత్వంలో సాంఘిక సంక్షేమ శాఖ యువజన, మహిళా రక్షణ విభాగానికి చెందిన 10 మంది సభ్యులు ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబాలతో చర్చించిన అధికారులు, 14 ఏళ్లలోపున్న బాలికకు వివాహం చేస్తే బాల్యవివాహం నిరోధక చట్టం కింద చర్యలు చేపడతామని హెచ్చరించారు. బాలికను పిల్లల ఆశ్రమానికి తరలించిన అధికారులు, ఆమెకు 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలని తండ్రి రాజాకు సూచించారు.

కార్తీక సోమవారం వేడుకలు.. అరంగులనాథాలయంలో శంఖాభిషేకం



పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని అరంగులనాథాలయంలో 1,008 శంఖాలతో అభిషేకం నిర్వహించారు. పుదుకోట జిల్లాలోని అరంగుళనాథర్ పెరియనాయకి అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ వసంత మండపంలోని ఉత్సవమూర్తులను వేంచేపు చేసి, యాగపూజలు, ధాన్యంతో శివలింగం నమూనా, అందులో 1008 శంఖాలుంచారు. శంఖాల్లో పుణ్యజలాలు నింపి, మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం కలశాల్లోని పుణ్యజలాలను శివలింగంపై ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

ఒకేరోజు 53.83 మెట్రిక్ టన్నుల వ్యర్థాల సేకరణ


పాత సామాన్లు సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 15వ తేదీ (శనివారం) 53.83 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు సేకరించారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... నగరంలోని ఇళ్ల దగ్గరకే వెళ్లి పారిశుధ్య కార్మికులు రోజూ సుమారు 6,500 మెట్రిక్ టన్నుల పొడి, తడి చెత్త, వెయ్యి మెట్రిక్ టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలు సేకరిస్తున్నారు. ప్రతి శనివారం ఇళ్ల వద్దకే వెళ్లి పాత చెక్కలు, సోఫాలు సేకరించాలని జీసీసీ నిర్ణయించి, గత నెల 11వ తేది ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఆ ప్రకారం, అక్టోబరు 11,18,25, నవంబరు 1, 8వ తేది తదితర శనివారాల్లో 271.74 మెట్రిక్ టన్నుల పాత సామగ్రి సేకరించారు. ఈ నెల 15వ తేది 53.83 మెట్రిక్ టన్నుల పాత సామగ్రి సేకరించి, కొడుంగైయూర్‌లో శాస్త్రీయంగా దహనం చేశారు. ప్రతి శనివారం పాత సామనుల సేకరణ జరుగుతుందని, ఇళ్ల యజమానులు 'నమ్మ చెన్నై' యాప్ ద్వారా, 1913 అనే నెంబరు, 9445061913 అనే వాట్సాప్ నెంబరును సంప్రదించి తమ వివరాలు తెలియజేస్తే, పారిశుధ్య కార్మికులు వారింటికే వెళ్లి పాత సామానులు సేకరిస్తారని జీసీసీ తెలిపింది.

సామాజిక మార్పులో పరిశోధనలకు విద్యాసంస్థలకు ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక మార్పు కోసం పరిశోధనలు చేసి ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర విద్యాశాఖ విద్యాసంస్థలను ఆహ్వానించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చి (ఐసీఎస్ఎస్ఆర్) సంస్థ 'అభివృద్ధి చెందిన భారత దేశం' అనే లక్ష్యాన్ని నిర్ధేశించి, ప్రస్తుత, భవిష్యత్తు సామాజిక సవాళ్లకు పరిష్కారం కనుగొనేలా పరిశోధన ప్రాజెక్టులు చేపట్టేలా విద్యా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, నిర్వహణ, రాజకీయ శాస్త్రం, ప్రజా పరిపాలన, అంతర్జాతీయ సంబంధాలు, జాతీయ భద్రత, లింగ అధ్యయనాలు, సామాజిక మనస్తత్వ శాస్త్రం, ప్రజారోగ్యం, పర్యావరణ, సాంస్కృతిక, సంస్కృత అధ్యయనాలు వంటి 31 అంశాల్లో పరిశోధనలకు ఐసీఎస్ఎస్ఆర్ ఆహ్వానిస్తోంది. ఇందులో చిన్న పరిశోధన ప్రాజెక్టులు రూపొందించేందుకు 12 నెలల వ్యవధి ఇస్తుండగా, గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు నిధులు సమకూరుస్తోంది. అలాగే, పెద్ద ప్రాజెక్టులకు 25 నెలల వ్యవధి ఇస్తుండగా, రూ.30 లక్షల వరకు నిధులు అందజేస్తోంది. పరిశోధన ప్రాజెక్టులు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న విద్యాసంస్థలు https://icssr.org అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసీఎస్ఎస్ఆర్ ఒక ప్రకటనలో తెలిపింది.

కరూరు దుర్ఘటన వ్యవహారం

పవర్‌గ్రిడ్, హైవే అధికారుల విచారణ


సీబీఐ విచారణకు హాజరై వెళ్తున్న పవర్‌గ్రిడ్ అధికారులు

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే నేత విజయ్ రోడ్‌షోలో తొక్కిసలాటలో 41 మంది దుర్మరణం చెందిన సంఘటనపై సీబీఐ అధికారులు తమ విచారణ ముమ్మరం చేశారు. ఆ సంఘటనకు సంబంధించి సోమవారం ఉదయం రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (పవర్‌గ్రిడ్) అధికారులు, హైవే అధికారులను సీబీఐ అధికారులు విచారణ జరిపారు. కరూర్ జిల్లా కె.పరమత్తి ప్రాంతంలోని పవర్‌గ్రిడ్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ బోర్డు అధికారులు ఇద్దరు, హైవేస్ అధికారులు ఐదుగురు సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 11.30 గంటల నుండి సీబీఐ అధికారులు వీరిని విచారించారు.

ఎక్స్‌కవేటర్ చోరీ కేసులో యువకుడి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎక్సకవేటర్ చోరీ చేసిన యువకుడు కటకటాల పాలయ్యాడు. తిరునల్వేలి జిల్లా గంగైకొండాన్ సిప్కాట్‌లోని ఓ కంపెనీలో సెందిల్ వేల్ (45) మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ సంస్థలో ఎక్సకవేటర్ ఈ నెల 13న కనిపించ లేదు. ఈ విషయమై సెందిల్‌వేల్ గంగైకొండాన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ వేల్‌కని నేతృత్వంలో పోలీసులు చేపట్టిన విచారణలో.. తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోయిల్‌కు చెందిన కరుప్పస్వామి కుమారుడు ఈశ్వరన్ ఆ ఎక్సకవేటర్ చోరీచేసినట్లు తెలిసింది. కేసు నమోదుచేసిన పోలీసులు సోమవారం ఈశ్వరన్‌ను జైలుకు తరలించారు.

అలల్లో చిక్కుకుని ఇద్దరు విద్యార్థుల మృతి

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సముద్రపు అలల్లో చిక్కుకుని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతిచెందారు. ఆంధ్ర రాష్ట్రం తిరుపతికి చెందిన కేతన్‌కుమార్ (19), నిఖిల్ ఆనందన్ (19) తిరుపోరూర్ సమీపం కాలవాక్కంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలసి వారు కోవలం బీచ్‌కు వెళ్లారు. అక్కడ వారందరూ స్నానం చేస్తుండగా భారీ అలల తాకిడికి కేతన్‌కుమార్, ఆనందన్ గల్లంతయ్యారు. స్నేహితులు కేతన్‌కుమార్‌ను రక్షించి చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అతను అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేలాంబాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో, గల్లంతైన నిఖిల్ ఆనందన్ మృతదేహం ఆదివారం సాయంత్రం తీరానికి కొట్టుకొచ్చింది. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

గిరి ప్రదక్షిణ మార్గంలో సీసీ కెమెరాలు


సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్న ఉద్యోగులు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరిప్రదక్షిణ మార్గంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. అరుణాచలేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవాలు ఈ నెల 21 నుంచి డిసెంబరు 7వ తేది వరకు జరుగనున్నాయి. ఈ వేడుకల్లో ప్రధానాంశమైన కార్తీక దీపోత్సవం డిసెంబరు 3వ తేది సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వచ్చే వారికి భద్రత కల్పించేలా ఆలయం, ప్రాంగణాలు, మాఢవీధులు, గిరి ప్రదక్షిణ మార్గంలో అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఇప్పటికే 259 శాశ్వత వాచ్ టవర్లుండగా, తాత్కాలికంగా మరో 572 వాచ్ టవర్లు ఏర్పాటుపనులు జరుగుతున్నాయని జిల్లా అధికారులు తెలిపారు.

31 మంది జాలర్ల విడుదల

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైలులో ఉన్న 31 మంది జాలర్లను విడుదల చేస్తూ ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. నాగపట్టణం ఫిషింగ్ హార్బర్ నుంచి ఈ నెల 3వ తేదీ జాలర్లు చేపల వేటకు వెళ్లారు. వారు కచ్చాదీవి సమయంలో చేపల వేట సాగిస్తుండగా శ్రీలంక నావికా దళ అరెస్ట్ చేసింది. కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. జాలర్లకు విధించిన రిమాండ్ గడువు ముగియడంతో విచారణ అనంతరం జాలర్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఎన్నికల సమయంలో రూ.11 కోట్లు స్వాధీనం కేసు

- నేడు మళ్లీ విచారణ

వేలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రూ.11 కోట్లు స్వాధీనం చేసుకున్న కేసు విచారణ మంగళవారానికి వాయిదా పడింది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిగా పోటీచేసిన కదిర్ ఆనంద్ ఓటర్లకు నగదు బట్వాడా చేయనున్నారని ఐటీ శాఖ అధికారులకు సమాచారం అందింది. కాట్పాడికి చెందిన డీఎంకే నాయకుడు పూంజోలై శ్రీనివాసన్‌కు చెందిన సిమెంట్ గోడౌన్‌లో తనిఖీలు చేసిన అధికారులకు రూ.11 కోట్ల నగదు లభ్యమైంది. ఈ వ్యవహారంలో కదిర్ ఆనంద్, ఆయన అనుచరులు పూంజోలై శ్రీనివాసన్, దామోదరన్‌లపై కాట్పాడి పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విచారణకు రాగా పూంజోలై శ్రీనివాసన్, దామోదరన్ హాజరయ్యారు. తదుపరి విచారణ వాయిదావేస్తూ న్యాయమూర్తి శక్తికుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

జీసీసీ ఆధ్వర్యంలో 'మెరీనా ఆర్ట్స్ ఫెస్టివల్'

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో ప్రతి ఆదివారం సాయంత్రం 'మెరీనా ఆర్ట్స్ ఫెస్టివల్' జరుగుతోంది. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటనలో.. ఆసియాలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధిచెందిన మెరీనా బీచ్‌కు ప్రతిరోజు స్థానికులు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన వారు సందర్శిస్తుంటారని తెలిపింది. ఆదివారం, పండుగ రోజుల్లో బీచ్‌కు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో, పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగించేలా 'మెరీనా ఆర్ట్స్ ఫెస్టివల్' నిర్వహించనున్నట్లు తెలిపింది. సెప్టెంబరు 21వ తేది నుంచి ప్రతి ఆదివారం సాయంత్రం సంప్రదాయ, జానపద, గ్రామీణ కళారూపాలు ప్రదర్శిసున్నట్లు తెలిపింది. మెరీనా స్విమ్మింగ్ ఫూల్ సమీపంలో నిర్వహించే ఈ ప్రదర్శనలను ప్రజలు వీక్షించాలని జీసీసీ పిలుపునిచ్చింది.

మేల్‌మరువత్తూర్‌లో 57 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాండియన్, రాక్‌ఫోర్ట్ సహా 57 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మేల్ మరువత్తూర్‌లో స్టాపింగ్ ఇచ్చారు. ఈ విషయమై దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... శబరిమల సీజన్, తైపూసం సందర్భంగా డిసెంబరు 15 నుంచి 31వ తేది వరకు మేల్‌మరువత్తూర్‌లో 57 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక హాల్ట్ ఏర్పాటు చేశామని తెలిపింది. ఆ ప్రకారం, చెన్నై ఎగ్మూర్-మదురై వైగై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎగ్మూర్-మదురై పాండియన్ ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎగ్మూర్-తిరుచ్చి రాక్‌ఫోర్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎగ్మూర్-సెంగోట్టై పొదిగై ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎగ్మూర్-నాగర్‌కోయిల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎగ్మూర్-కొల్లం ఎక్స్‌ప్రెస్, తాంబరం-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎగ్మూర్-మన్నార్‌గుడి ఎక్స్‌ప్రెస్ సహా 57 రైళ్లు ఇరుమార్గాల్లో మేల్‌మరువత్తూర్‌లో ఒక నిముషం ఆగి వెళతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

ఘనంగా సుందరం ఫైనాన్స్ సేలం శాఖ వార్షికోత్సవం


సేలం శాఖ సిబ్బంది

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుందరం ఫైనాన్స్ సేలం శాఖ 60వ వార్షికోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. సేలం బ్రాంచ్ మేనేజర్ కె.శివాజీ, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.కన్నదాసన్ తదితరుల నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ, కన్నదాసన్ మాట్లాడుతూ.. 1959లో స్థాపించబడిన సేలం శాఖ విస్తరణలో కీలకపాత్ర పోషించిందన్నారు. చిన్నవ్యాపారులు, మొదటిసారి రుణగ్రహీతలు, స్వయం ఉపాధి పొందుతున్న నిపుణులు, రవాణా నిర్వాహకులు ఈ శాఖను నమ్మకమైన ఆర్థిక భాగస్వామిని భావించారని పేర్కొన్నారు.

తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవ భద్రతా ఏర్పాట్లు

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపోత్సవాల సందర్భంగా తిరువణ్ణామలైలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు నోటీసు జారీచేసింది. న్యాయవాది యానై రాజేంద్రన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో.. తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాల్లో ప్రధానాంశంగా డిసెంబరు 3వ తేది మహా దీపం వెలిగించనున్నారని వివరించారు. ఈ వేడుకల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన భద్రత ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ పీపీ బాలాజీ కార్తీక దీపోత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన భద్రతా చర్యలను ఈ నెల 24వ తేదిలోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, తిరువణ్ణామలై జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖకు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణ వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సోలార్ కేంద్రాల ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు, కరూర్ జిల్లాల్లో 15 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌరశక్తి విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో పవన, సౌర విద్యుత్ సహా గ్రీన్ పవర్ ప్రాజెక్టులు అమలుచేస్తోంది. ఈ క్రమంలో, తిరువారూరు జిల్లా కోర్కై, కరూర్ జిల్లా కె.పిచ్చాంపట్టి ప్రాంతాల్లో తలా 15 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించింది. విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ కేటాయిస్తుంది. అక్కడ ప్రైవేటు సంస్థ తమ ఖర్చుతో విద్యుత్ కేంద్రం ఏర్పాటుచేయాలి. ఉత్పత్తయ్యే విద్యుత్ మూడు గంటలు నిల్వచేసేలా 'బ్యాటరీ' సౌకర్యం ఏర్పాటుచేయాలని టెండర్లలో పేర్కొన్నారు. ఆ కేంద్రం నుంచి 25 సంవత్సరాల వరకు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ విద్యుత్ కొనుగోలు చేసి తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు అందజేయనుంది.

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు మైసూర్‌లో శిక్షణ

పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 8వ తేది వరకు బోధించే ఉపాధ్యాయులకు మైసూర్‌లోని దక్షిణ భారత ప్రాంతీయ భాషా సంస్థ ఐదు రోజులు శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు ప్రాథమిక విద్య డైరెక్టర్ నరేష్, అన్ని జిల్లా విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో వివరాలిలా ఉన్నాయి... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యాసం మెరుగుపరిచేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో ఉపాధ్యాయులకు వివిధ శిక్షణలు అందిస్తున్నామన్నారు. ఆ ప్రకారం, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఆదివారం నుంచి ఈ నెల 21వ తేది వరకు మైసూర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్‌లో తెలిపింది.

జాలరి వలలో చిక్కిన అరుదైన చేప



పెరంబూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాలరి వలలో చిక్కిన అరుదైన చేపను ప్రజలు ఆశ్చర్యంతో వీక్షించారు. రామనాథపురం జిల్లా పాంబన్ ఉత్తర తీరం నుంచి మన్నార్ గల్ఫ్ ప్రాంతానికి నాటుపడవల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లారు. చేపల వేట తరువాత ఆదివారం ఉదయం జాలర్లు తీరానికి చేరుకున్నారు. ఓ జాలరి వలలో అరుదైన 'ఎల్లో టైల్ ట్యూనా' అనే చేపతో పాటు పలురకాల చేపలున్నాయి. మూడు మీటర్ల వెడల్పు, 112 కిలోల బరువున్న ఈ చేపను నలుగురు జాలర్లు తీరానికి తీసుకొచ్చారు. ఆ చేపను కేరళకు చెందిన వ్యాపారి రూ.17 వేలకు కొనుగోలు చేశారు. ఈ విషయమై జాలర్లు మాట్లాడుతూ... ఎల్లో టైల్ ట్యూనా చేపలు అట్లాంటిక్, హిందూ మహా సముద్రాల్లో చాలా లోతైన నీటిలో మాత్రమే ఉంటాయన్నారు. ఈ చేపలు వలలో చిక్కడం చాలా అరుదుగా ఉంటుందని జాలర్లు తెలిపారు.

నేటినుంచి పోలింగ్ కేంద్రాల్లో ఓటరు సహాయ కేంద్రాలు

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లా పరిధిలోని (947) పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం నుంచి ఈ నెల 25వ తేది వరకు పోలింగ్ సహాయ కేంద్రాలు పనిచేస్తాయని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ జె.కుమారగురుపరన్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... కేంద్ర ఎన్నికల సంఘం సూచనలతో చెన్నై జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పనులు (సర్) చెన్నై జిల్లా పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. బూత్ లెవల్ అధికారులు 16 నియోజకవర్గాల్లోని ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఫారాలు అందజేసి, నింపిన ఫారాలు స్వీకరిస్తున్నారని తెలిపారు. గణన ఫారాలు పూరించడంలో ఓటర్లకు ఉన్న సందేహాలు నివృత్తి చేసేలా జిల్లా పరిధిలోని 947 పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం నుంచి 8 రోజులు సహాయ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు.

నటీనటులు ప్రజల ఆస్తి
హేళన చేయడం భావ్యం కాదు

- బిగ్‌బాస్ షో నిషేధించాలి
- దర్శక నటుడు బోస్ వెంకట్


బోస్ వెంకట్

నటీనటులు ప్రజల ఆస్తి అని, ప్రజల కోసమే వారు ఆడిపాడుతున్నారని, అలాంటి వారిని హేళనచేస్తూ మాట్లాడటం భావ్యం కాదని ప్రముఖ నటుడు, దర్శకుడు బోస్ వెంకట్ అన్నారు. ఇటీవలికాలంలో నటీనటులకు జరుగుతున్న అవమానాలపై ఆయన మాట్లాడుతూ, 'నటీనటులను ప్రశ్నించే వారు ఎవరైనా కావొచ్చు. వారిపై ఎల్లవేళలా ఓ కన్ను ఉంటుంది. నటీనటులను కించపరిచేలా మాట్లాడినా? ప్రశ్నించినా? మీడియాకే నష్టం. మేం ఆడిపాడేది మీ కోసమే. అందువల్ల నటీనటులను హేళన చేస్తూ మాట్లాడం మానుకోవాలి. నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు చాలా మేరకు పూర్తయ్యాయి. వచ్చే యేడాది ఒక అద్భుత భవన ప్రారంభోత్సవ వేడుక ఉంటుంది. రాజకీయాలు అనేది ప్రజలకు సేవ చేయడం. ప్రజా సేవ కోసం ఫలాన శాఖకు చెందిన వారే రావాలన్న నియమం లేదు. అయితే, నిజమైన సేవా గుణంతో రాజకీయాల్లోకి వస్తున్నారా? అనేది ప్రధాన ప్రశ్న. రాజకీయాల్లోకి వచ్చే వారి అనుభవం ఏంటి? వారికి ప్రజా సమస్యలపై ఉన్న అవగాహన, సత్సంబంధాలు, ప్రజా సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇత్యాది విషయాలు ఎంతో ముఖ్యం. బిగ్‌బాస్ రియాలిటీ షో ఒక్క తమిళంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ప్రసారమవుతోంది. ఇది సంస్కృతిని నాశనం చేస్తోంది. సో.. ఇలాంటి షోలపై నిషేధం విధించడంలో తప్పులేదు. మనకంటూ ఓ సంస్కృతి సంప్రదాయాలున్నాయి. కానీ, టీవీలో ప్రసారమయ్యే వాటికి సెన్సార్ లేదు. సో... మనమే హద్దుల్లో ఉండటం మంచిది' అని పేర్కొన్నారు.



ఎస్కే సరసన శ్రీలీల

చిత్రజ్యోతి

హీరో శివకార్తికేయన్ (ఎస్కే) సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటించనున్నారు. శిబి చక్రవర్తి దర్శకత్వం వహించే ఈ మూవీ కోసం ఈ తెలుగమ్మాయిని కథానాయికగా ఎంపిక చేశారు. డిసెంబరులో ఈ మూవీ సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు. ఫ్యాషన్ స్టూడియోస్ బ్యానరులో సుధన్ సుందరం ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌లో నిర్మించనున్నారు. 'డాన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ తర్వాత శివకార్తికేయన్ - శిబి చక్రవర్తి కాంబినేషన్‌లో రానున్న చిత్రం కావడంతో భారీ అంచనాలున్నాయి. ఇదిలావుంటే, ప్రస్తుతం ఎస్కే 'పరాశక్తి' మూవీలో నటిస్తున్నారు. ఇందులో కూడా శ్రీలీల హీరోయిన్‌గా నటించారు. సుధా కొంగర దర్శకురాలు. జనవరి 14న ఈ చిత్రం విడుదలకానుంది.

ప్రదీప్ 'ఎల్‌ఐకే' మళ్లీ వాయిదా?


'ఎల్‌ఐకే'లో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి

'లవ్‌టుడే', 'డ్రాగన్', 'డ్యూడ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకున్న దర్శక హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన మరో కొత్త చిత్రం 'ఎల్‌ఐకే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ) విడుదలకు బ్రేక్‌లు పడుతునే ఉన్నాయి. వాస్తవానికి ఈ మూవీ దీపావళికి రిలీజ్ చేసేలా తొలుత ప్లాన్ చేశారు. కానీ, ప్రదీప్ నటించిన 'డ్యూడ్' దీపావళికి రిలీజ్ కావడంతో 'ఎల్‌ఐకే' వాయిదా వేసి, డిసెంబరు 18న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇపుడు ఈ తేదీకి కూడా రిలీజ్ చేయడం లేదన్నది సినీ వర్గాల సమాచారం. దీనికి కారణం.. మూవీ ఓటీటీ రైట్స్ ఇంకా అమ్ముడుపోలేదట. అందుకే మరోమారు వాయిదా వేసి న్యూ ఇయర్ సందర్భంగా విడుదల చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే, సినిమా విడుదల తేదీపై నిర్మాత లలిత్ కుమార్ వైపు నుంచి ఎలాంటి ప్రకటన రావడం లేదు. కృతిశెట్టి హీరోయిన్‌గా, లవ్, కామెడీ కలిసిన సైన్స్ ఫిక్షన్ మూవీకి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించగా, విలన్ పాత్రలో ఎస్‌జే సూర్య నటించారు. అందుకే ఈ చిత్ర విజయంపై భారీ అంచనాలే నెలకొనివున్నాయి.


పా.రంజిత్ - దళిత్ సుబ్బయ్య

'ఆస్కార్'కు ఎంపికైన పా.రంజిత్ డాక్యుమెంటరీ

'దళిత్ సుబ్బయ్య - వాయిస్ ఆఫ్ ది రిబెల్స్' అనే పేరుతో ప్రముఖ దర్శక నిర్మాత పా.రంజిత్ రూపొందించిన డాక్యుమెంటరీ 2026 సంవత్సరానికిగాను 'ఆస్కార్' పోటీకి ఎంపికైంది. ఈ డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను నీలం ప్రొడక్షన్, యాళి ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించాయి. దివంగత గాయకుడు, రచయిత దళిత్ సుబ్బయ్య జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని మ్యూజికల్ డాక్యుమెంటరీగా రూపొందించారు. ప్రస్తుతం ఈ ఫిల్మ్ ఆస్కార్ అవార్డుల పోటీలో 'అఫీషియల్ కంటెండర్'గా ఎంపికైనట్టు నీలం ప్రొడక్షన్ అధికారికంగా ప్రకటించింది.

వాణిజ్య నగరంలో ఉద్యానవనం
కోవైలో సెమ్మొళి పూంగా


ఉద్యానవనంలో ఏపుగా పెరిగిన వృక్షాలు


సందర్శకుల గ్యాలరీ ఏరియా

- 45 ఎకరాల్లో విశాలమైన పార్కు
- రాజమహేంద్రవరం నుంచి తెప్పించిన పూలమొక్కలు
- 26న ప్రారంభించనున్న సీఎం స్టాలిన్



ఎంట్రన్స్‌లో కృత్రిమ పర్వతాన్ని నిర్మిస్తున్న కార్మికులు - పిల్లల ఆట స్థలం

వాణిజ్యనగరం కోయంబత్తూరులో రూ.83.50 కోట్లతో 45 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న సెమ్మొళి పూంగా నిర్మాణం చివరి దశ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సెమ్మొళి పూంగాను ఈ నెల 26న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఈ పార్కులో వెయ్యి సీట్ల సామర్థ్యంతో కన్వెన్షన్ సెంటర్ కూడా నిర్మించారు. ప్రవేశద్వారం వద్ద పెద్ద కృత్రిమ పర్వతాన్ని కూడా నిర్మించారు. ప్రతి లాన్‌లో గోడలపై జంతువుల బొమ్మలున్నాయి. సంగ కాలం నాటి దాతృత్వానికి పేరుగడించి ఏడుగురు ప్రముఖుల శిల్పాలు కూడా ఏర్పాటు చేశారు. రాజహేంద్రవరం నుంచి తీసుకొచ్చిన పూల మొక్కలతో 23 మూడు థీమ్ పార్కులు కూడా నిర్మించారు. అంతేకాకుండా వంద రకాలకు చెందిన గులాబీలతో తోట కూడా ఏర్పరస్తున్నారు. ఆరులక్షల నీటి సామర్థ్యం కలిగిన ఫౌంటైన్ నిర్మాణం చివరి దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే రాష్ట్ర మంత్రులు సెంథిల్‌బాలాజీ, కేఎన్ నెహ్రూ ఈ ఉద్యానవనం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ నెల 25వ తేదీ లోగా అన్ని పనులు పూర్తవుతాయని, ఆ మరుసటి రోజే ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ ఉద్యానవనాన్ని ప్రారంభిస్తారని మంత్రి కేఎన్ నెహ్రూ ప్రకటించారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి


సందర్శకులు నడిచి వెళ్లే మార్గం

వేళచ్చేరిలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో మెడిల్యాబ్స్ ఆధునిక వసతులతో సమకూర్చిన వెల్‌నెస్ సెంటర్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం ప్రారంభించారు. ప్రసవం, లింగ నిర్ధారణ, గర్భకోశ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు స్క్రీనింగ్, స్కానింగ్ సదుపాయాలు ఈ సెంటర్‌లో అందుబాటులోకి వచ్చాయి. గిరియాస్ సంస్థ డైరెక్టర్ నితీష్ గిరియా, మెడిల్యాబ్స్ డైరెక్టర్లు డా.ప్రకాష్, ఢిల్లీ బాబు తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.


మెడిల్యాబ్స్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

ఢిల్లీ విమానాలు ఆలస్యం.. ప్రయాణికుల ఆగ్రహం

చెన్నై, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఉదయం ఢిల్లీ వెళ్లాల్సిన మూడు విమానాలు ఆలస్యంగా బయలుదేరటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఉదయం 6 గంటలకు ఢిల్లీ వెళ్ళాల్సిన విమానం ఉదయం 8.05 గంటలకు, ఉదయం 8 గంటలకు బయలుదేరాల్సిన విమానం మూడు గంటల ఆలస్యంగా ఉదయం 11 గంటలకు బయలుదేరాయి. ఇదే విధంగా ఉదయం 11 గంటలకు ఢిల్లీకి బయలుదేరాల్సిన విమానం మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరింది. సకాలంలో వెళ్ళాల్సిన ఈ విమానాలను రెండు నుండి మూడు గంటలు ఆలస్యంగా, ఎలాంటి కారణం ప్రకటించకుండా ఆలస్యంగా నడపటం పట్ల ఆ విమానాల్లో ప్రయాణించాల్సినవారంతా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ద్వారా తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్యలో ఉద్యోగానికి ఎంపికైన యువతికి నియామక పత్రం అందజేస్తున్న పాడి పరిశ్రమల శాఖ మంత్రి మనో తంగరాజ్



ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులతో చైర్మన్ మునిరత్నం

తిరువళ్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎండి ఇంజనీరింగ్ కళాశాల 34వ పూర్వ విద్యార్థుల సమావేశం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎంకే విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ ఆర్.ఎస్. మునిరత్నం మాట్లాడుతూ... నాడు కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నేడు పలు కంపెనీల వ్యవస్థాపకులుగా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. వైస్ చైర్మన్ ఆర్.ఎం. కిషోర్ మాట్లాడుతూ.. కళాశాల నుండి ఇప్పటి వరకు 19 మంది విద్యార్థులు సివిల్స్, ఇతర ప్రభుత్వ ఉన్నత పదవుల్లో ఉండటం గర్వకారణమన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఏఎస్పీ (శిక్షణ) వి.రాహుల్ మాట్లాడుతూ... ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, నిరంతర పట్టుదలతో ప్రయత్నిస్తే తప్పక విజయం సాధించవచ్చన్నారు. కళాశాలలో సివిల్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు 18-క్రెడిట్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. సివిల్స్‌కు సిద్ధమవుతున్న కళాశాల విద్యార్థులకు సూచనలివ్వడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.అన్బుచెళియన్, డీన్ డాక్టర్ కె.కె. త్యాగరాజన్, డైరెక్టర్ ఆర్.జ్యోతినాయుడు, కార్యదర్శి యలమంచి ప్రదీప్, సలహాదారులు వి.మనోహరన్, డాక్టర్ ఎం.ఎస్. పళనిసామి, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షురాలు బి.ప్రవీణ, సభ్యులు డాక్టర్ ఆర్.శశికుమార్, ఎన్.కృష్ణకుమార్ తదితరులు కూడా పాల్గొన్నారు.

క్లినికల్ మెడిసిన్‌లో నిర్ణయం అత్యంత కీలకం

- డాక్టర్ మంజునాథ్


స్మారకోపన్యాసంలో ప్రముఖులు

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్లినికల్ మెడిసిన్‌లో నిర్ణయం తీసుకోవడం అత్యంత ముఖ్యమని ప్రముఖ కార్డియాలజిస్ట్, పార్లమెంటు సభ్యులు డాక్టర్ సీఎస్ మంజునాథ్ పేర్కొన్నారు. సోమవారం శ్రీ రామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కార్డియాక్ కేర్ సెంటర్ నిర్వహించిన డాక్టర్ తనికాచలం స్మారకోపన్యాసంలో పాల్గొన్న డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా మెషిన్ లెర్నింగ్ వున్నా టచ్-టాక్-ట్రీట్-ట్రస్ట్ ఎంతో కీలకమని వివరించారు. ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఈ స్మారకోపన్యాసంలో ప్రముఖ నిపుణులు, వైద్యులు కూడా పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

'బాటిల్ ఆఫ్ బ్రెయిన్స్'గా రాజాజీ విద్యాశ్రమ విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'కాసాగ్రాండ్' ఆధ్వర్యంలో జరిగిన 'బాటిల్ ఆఫ్ బ్రెయిన్స్ ఛాంపియన్స్ ట్రోఫీని నగరంలోని రాజాజీ విద్యాశ్రమ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అంతేగాక ప్రతిష్ఠాత్మక ట్రోఫీతో పాటు రూ.4 లక్షల విలువైన బహుమతులను కూడా గెలుచుకున్నారు. వందకు పైగా పాఠశాలలకు చెందిన 6-9 తరగతులకు చెందిన 800 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా, జోనల్ రౌండ్ల వారీగా పోటీలు జరిగాయి. ప్రతి జోనల్ ఫినాలే నుంచి మొదటి మూడు జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. అందులో ఫైనల్‌కు బీవీ భవన్‌లోని రాజాజీ విద్యాశ్రమం, సాందీపని విద్యాలయ పాఠశాలలు తొలి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ప్రముఖ టీవీ యాంకర్ గోపీనాథ్, కాసాగ్రాండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గౌతం అగర్వాల్, నెక్సస్ కన్సల్టింగ్ వ్యవస్థాపకులు వెంకటేష్ శ్రీనివాసన్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

కేటీసీటీలో ఘనంగా బాలల దినోత్సవం


స్మార్ట్ క్లాస్ రూమ్ సమగ్రత ప్రతిభా పురస్కారాన్ని సాధించిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎస్కేపీడీ నిర్వహణలోని కేటీసీటీ బాలికల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, మహోన్నత పాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని సోమవారం బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. గౌరవ కరస్పాండెంట్, సీనియర్ న్యాయవాది ఎస్ఎల్ సుదర్శనం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో ఫ్యాషన్ డిజైనర్ మల్లికా కేషబ్ చందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తులో ముందుకెళ్లేందుకు విద్యార్థులు కృషిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అనిల మాట్లాడుతూ, ఇటీవల ప్రైమ్ ఇండియా ఫౌండేషన్ శిక్షశక్తి అవార్డుల కార్యక్రమంలో కేటీసీటీ పాఠశాల నుంచి ఉత్తమ స్మార్ట్ క్లాస్ రూమ్ సమగ్రత ప్రతిభా పురస్కారాన్ని అందుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. పాఠశాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎస్కేపీడీ ట్రస్టీలు, పాఠశాలల కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం అందిస్తున్న సహాయ సహకారాలు, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. కాగా, పాఠశాల తరుపున నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అలాగే ఐఐటీ మద్రాస్ నిర్వహించిన డేటా సైన్స్ సర్టిఫికెట్ కోర్సును ఉపాధ్యాయురాలు సుధ సారథ్యంలో విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి పీఈ టీ దేవి, టీచర్ భువనేశ్వరి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని అన్నానగర్ మండల కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు సోమవారం ఉదయం అల్పాహారం అందిస్తున్న అధికారులు

వాసవీ అయ్యప్ప సేవా సంఘం ప్రారంభం


ప్రారంభోత్సవంలో పద్మనాభన్, బి.గిరి, ఇళంగో తదితరులు

ప్యారీస్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాసవీ అయ్యప్ప సేవా సంఘం తమిళ కార్తిక సోమవారం సందర్భంగా ప్రారంభమైంది. ఈ సంఘం వ్యవస్థాపకులు వాసవీ క్లబ్ షావుకారుపేట చెన్నై రీజియన్ చైర్మన్ ఎస్వీ పద్మనాభన్ అధ్యక్షతన నాట్టు పిళ్లైయార్ వీధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో శబరీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా-వి502ఎ గవర్నర్ సీఎం రాజేష్, సెంట్రల్ చెన్నై తూర్పు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.గిరి, ఇళంగో హాజరై మెగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ఎ.జయకుమార్, దయాళ ఉపేంద్రకుమార్, శివశంకర్‌రెడ్డి, భాస్కర్, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, ఉదయ్‌కుమార్, జె.చంద్రశేఖర్, పి.బద్రినారాయణ, జె.కిరణ్‌కుమార్, కాశి యాత్ర ఆర్గనైజర్ భోగనాథం శివకుమార్, బాలకుమార్, వెంకటేష్ పెరుమాళ్, గంగాధర గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

- బాలల దినోత్సవ బహుమతి..

పేదబాలలకు విమానయానం

అడయార్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల రెయిన్‌డ్రాప్స్ చారిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 మంది పేద చిన్నారులకు తొలి సారి విమానంలో ప్రయాణించే అవకాశం కల్పించారు. ఇందులో ఓ హిజ్రా, అంధ విద్యార్థి కూడా ఉన్నారు. చెన్నై నుంచి తూత్తుకుడికి ప్రయాణించిన ఈ చిన్నారుల వ్యయమంతా ఆనందం, వీజీపీ ఉళగ తమిళ సంఘం, వేల్స్ విద్యాలయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌తో కలిసి రెయిన్‌డ్రాప్స్ చారిటీ ఫౌండేషన్ భరించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమం, మహిళా సాధికారత మంత్రి పి.గీతా జీవన్ కూడా ఈ చిన్నారులతో కలిసి ప్రయాణించడం విశేషం. ఆమెతో పాటు రెయిన్‌డ్రాప్ వ్యవస్థాపకులు అరవింద్ జయబాల్, సంగీత దర్శకురాలు ఏఆర్ రైహానా, వీజీపీ గ్రూప్ చైర్మన్ అరవింద్ జయబాల్, రాష్ట్ర ప్రణాళికా కమిషన్ సభ్యుడు డాక్టర్ వీజీపీ సంతోషం, డాక్టర్ సుల్తాన్ అహ్మద్ ఇస్మాయిల్, ఆనందం వ్యవస్థాపకులు మేనకా తదితరులున్నారు.






శుక్రవారపుతోటలో

ఫలపుష్ప సోయగం







పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరులోని అమ్మవారి శుక్రార పుతోటలో టీటీడీ ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ధ్వజారోహణం అనంతరం ఈ ప్రదర్శనను ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ప్రారంభించారు. వివిధ పురాణ ఘట్టాలపై ఏర్పాటు చేసి మూర్తులు విశేష ఆకర్షణగా మారాయి. నరకాసురుని సంహరిస్తున్న సత్యభామ, పాలకడలిలోని మహావిష్ణువును కాలితో తన్నుతున్న భృగుమహర్షి, వామన అవతారంలో బలి చక్రవర్తిని పాతాళ లోకానికి పాదంతో తొక్కుతున్న దృశ్యం, తాటకిని సంహరిస్తున్న శ్రీరాముడు, శ్రీపద్మావతి, శ్రీనివాసుల కల్యాణ వైభోగం, అష్టలక్ష్మీవైభవం.. వంటివి సెట్టింగ్స్ వేసి కళ్లముందు సాక్షాత్కరించేలా చేశారు. గజేంద్రమోక్షం సైకత శిల్పం ఏర్పాటు చేశారు. అదే విధంగా కూరగాయల రూపొందించిన దేవతామూర్తుల మండపం ఆకర్షణీయంగా ఉంది. చామంతి, రోజా, పెట్రోనియా, బిగోనియా, సాల్వియా వంటి పూలతో రూపొందించిన ఏనుగు, కలశం, సీతాకోకచిలుక, డాల్ఫిన్‌లు ఆకట్టుకుంటున్నాయి. 25 వేల సీజనల్ ఫ్లవర్స్, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తున్నారు. ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్పప్రదర్శనశాలను తీర్చిదిద్దారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేదం వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం, వన మూలికల ప్రదర్శన,పుస్తక ప్రదర్శనలను కూడా ఈవో ప్రారంభించారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



మారుతీ ప్రసాద్

మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు డాక్టరేట్

కురబలకోట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీకి చెందిన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్, అధ్యాపకుడు మారుతీప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారని వీసీ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మారుతీప్రసాద్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని సత్యభామ యూనివర్శిటీలో 'యాన్ ఇంటలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐవోటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మిట్స్ యూనివర్శిటీ చాన్సలర్ ఎన్.విజయభాస్కర చౌదరి, ప్రో చాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి తదితరులు అభినందించారు.

తిరుమలలో ప్రముఖుల సందడి

తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ వీనోద్ కుమార్, ఇన్ఫోసిస్ సంస్థ చైర్‌పర్సన్ సుధా నారాయణమూర్తి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజజేంద్రప్రసాద్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, ఎన్టీఆర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ పీ చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ ఆర్వీ రవీంద్రన్, జస్టిస్ టీ వినోద్‌కుమార్, సుధా నారాయణమూర్తి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,004
తలనీలాలు సమర్పించినవారు: 23,900



తిరుమలలో 'ప్రేమంటే' హీరో, హీరోయిన్‌లు



తిరుమల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): 'ప్రేమంటే' సినిమా బృందం సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. హీరో ప్రియదర్శి, హీరోయిన్ ఆనంది, ఆ చిత్ర నిర్మాత పుష్కర్ రామ్మోహన్‌రావుతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 21న తమ చిత్రం విడుదల కానున్న సందర్భంగా స్వామిని దర్శించుకుని విజయం ప్రసాదించమని కోరుకున్నామన్నారు.

తిరుమలలో పెజావర మఠాధిపతి



ఉడిపిలోని పెజావర మఠాధిపతి విశ్వేషప్రసన్న తీర్థస్వామిజీ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్న మఠాధిపతికి ఆలయ పేష్కార్ రామకృష్ణ, పోటు పేష్కార్ మునిరత్నం, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అర్చక బృందంతో కలిసి ఇస్తికఫాల్(ఆలయ మర్యాదలు)తో స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తా: చిత్తూరు ఎంపీ



తిరుపతి/తిరుపతి(జీవకోన), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరిస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం చిత్తూరులో ఆయన్ను కలిసి సాధన సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ని కూడా కలిసి సాధన సమితి నేతలు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సాధన సమితి నాయకులు వైయస్ బాబు, బుజ్జి బాబు నాయుడు, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల వికేంద్రీకరణతో అభివృద్ధి

● వైజాగ్ సీఐఐ సమ్మిట్ సక్సెస్ వెనుక బాబు, లోకేశ్ కృషి



మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

తిరుపతి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు తీసుకొచ్చి, అభివృద్ధి వికేంద్రీకరణకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ కృషిచేస్తున్నారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ఎమ్మెల్యేలు సునీల్ (గూడూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. వైజాగ్‌లో జరిగిన సీఐఐ సమ్మిట్ విజయవంతమైన సందర్భంగా గురువారం వీరు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సీఐఐ సదస్సు దేశాన్ని ఆకర్షించిందని, రూ13లక్షల కోట్లు పెట్టుబడులు, 16లక్షల ఉద్యోగాలు సీఐఐ సదస్సు అందించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదన్నర లోపే డబుల్ ఇంజిన్ సర్కార్ కావడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవాటిని తరిమికొట్టారని మండిపడ్డారు. నాయకత్వంపై నమ్మకం ఉండడం వలనే పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వడమే కాకుండా 21 రోజుల్లో సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేస్తున్నారన్నారు. టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ మృతిపై వైసీపీ నాయకులు దొంగేదొంగ అన్నట్టుగా ఉందన్నారు. వైఎస్ వివేకా, పరిటాల రవి హత్యకేసులో సాక్షులు చనిపోయినట్టుగా పరకామణి చోరీ కేసులో ఆధారాలను వైసీపీ నేతలు చెరపేస్తున్నారని ఆరోపించారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.




మంచు తెరలను చీల్చుకుని బయటికి వస్తున్న భానుడు....నీటిలోపలున్న చేపలు పైకి వచ్చి సలసలమని పరిగెడుతున్న ధ్వనులు... ఆ చేపలను పట్టుకోవడానికి కొంగల ప్రయత్నాలు.... చిత్తూరు గంగినేని చెరువు కట్టపై సోమవారం ఉదయం వాకింగ్ చేస్తున్న వారికి ఆహ్లాదాన్ని మిగిల్చిన దృశ్యాలివి.

దీర్ఘకాలిక విద్యుత్తు సమస్యలను నా దృష్టికి తీసుకురండి

● 'డయల్ యువర్ సీఎండీ'లో వినియోగదారులకు శివశంకర్ సూచన



విద్యుత్ వినియోగదారుల సమస్యలను వింటున్న సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు17(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు చిన్నవాటితో పాటు పెద్దసమస్యలను తన దృష్టికి తీసుకొస్తే త్వరితగతన పరిష్కరించే అవకాశం ఉంటుందని సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ పరిధిలోని జిల్లాల నుంచి 67 మంది ఫిర్యాదులు చేసినట్లు ఆయన తెలిపారు. కరెంటు సర్వీసులు మంజూరు చేయాలని, కాలిపోయిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మార్చాలని, విద్యుత్ లైన్ల మార్పు, లోటల్టేజ్ సమస్య, సరఫరాలో అంతరాయాలపై ఫర్యాదులు వచ్చాయన్నారు. వీటిపై అధ్యయనం చేసి 15 రోజుల్లో పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన సమస్యల్లో, సాంకేతిక పరమైనవి మినహా మిగిలిన వాటిని పరిష్కరించామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, సీజీఎం జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకట రాజు, విజయన్ పాల్గొన్నారు.

శ్రీసిటీ పరిశ్రమల వితరణతో విద్యా వసతులు

● రూ.58 లక్షలతో సత్యవేడులో కళాశాల హాస్టల్, వానెల్లూరులో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం



సత్యవేడులో హాస్టల్ భవనం ప్రారంభించాక శ్రీసిటీ, ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ ప్రతినిధులు

సత్యవేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఫౌండేషన్ సహకారంతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, వీఆర్వీ పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా రూ.58 లక్షలతో నిర్మించిన నూతన విద్యా వసతులను ఆయా సంస్థల ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. సత్యవేడులో రూ.46 లక్షలు వెచ్చించి 3 విశాల గదులతో నిర్మించిన బీసీ బాలుర కళాశాల హాస్టల్ భవనాన్ని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా పరిశ్రమ ఎండీ హాజీమే కజోకా, శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి సోమవారం ఉదయం ప్రారంభించారు. సంస్థ డీజీఎం వెంకటేష్, సీఎస్ఆర్ కమిటీ సభ్యులు మల్లీశ్వరన్, పృథ్వీ, మహేష్, ప్రసాద్, శ్రీకాళహస్తి డివిజన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి మునీంద్ర, వార్డెన్లు రామయ్య, గంగాధరం పాల్గొన్నారు.

● శ్రీసిటీలోని చార్ట్-వీఆర్వీ పరిశ్రమ రూ.12 లక్షలతో సత్యవేడు మండలం వా నెల్లూరులో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనం, వంట గదులను వీఆర్వీ సంస్థ డైరెక్టర్(హెచ్ఆర్) యామిని సిన్హా, తయారీ విభాగం హెడ్ ప్రసంజిత్ ప్రారంభించారు. ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ వీఆర్వీ సంస్థల సీఎస్ఆర్ చర్యలను శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్)నిరీషా సన్నారెడ్డిఅభినందించారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

కోర్టులో లొంగిపోయిన మాజీ సీఈవో జగదీశ్

భాకరాపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు సహకార సంఘంలో రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడిన మాజీ సీఈవో జగదీశ్ సోమవారం పీలేరులోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండు విధించిందన్నారు. సహకార సంఘంలో వన్ గ్రాము గోల్డు ఆభరణాలు తాకట్టు పెట్టి 2022 నుంచి 2025 వరకు రూ.72 లక్షల మేరకు సీఈవో ద్వారా కె.రెడ్డమ్మ, సి.రుతున్‌కు రుణాలు మంజూరు చేశారు. ఈ నెల 4న డీసీసీ బ్యాంకు మేనేజరు పరిశీలనలో ఈ విషయాన్ని గుర్తించారు. బాధ్యులైన సీఈవో, అప్రైజరు, అప్పటి పాలకవర్గం, పర్సన్ ఇన్‌ఛార్జ్‌పై చర్యలు తీసుకోవాలన్న సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్ ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితమే అధికారులు జగదీశ్‌ను సస్పెండ్ చేశారు. కేసు నమోదు చేశాక పరారీలో ఉన్న జగదీశ్ సోమవారం కోర్టులో లొంగిపోయాడు.

ఫిర్యాదుదారులను తిప్పించుకోవద్దు

● అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 313 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 'పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి. పరిష్కారం కానివాటికి ఆయా ఫిర్యాదుదారులకు నివేదిక పంపండి. అంతేకానీ ఫిర్యాదుదారులను కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దు' అంటూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు పలు సమస్యలపై 313 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపై ఒక రెవెన్యూశాఖకే 199అర్జీలు రావడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు.

పింఛను ఇప్పించండి



నా అనే వారు నాకెవరూ లేరు. వృద్ధాప్యం కారణంగా నడవలేని పరిస్థితి. కంటిచూపు మందగించింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- అచ్చయ్య, బావాజీ కాలనీ, సూళ్లూరుపేట

మమ్మల్ని ఆదుకోండి



ఓళ్లూరు రాయలచెరువు కట్ట తెగి వరద ప్రవాహానికి ఇళ్లు, పొలాలు దెబ్బతిన్నాయి. మాకు జీవనాధారమైన వ్యవసాయ భూములపై ఇసుక మేట వేసింది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. మమ్మల్ని ఆర్థికంగా ఆదుకుని వ్యవసాయం చేసుకోవడానికి వీలుగా పొలాలను బాగుచేసుకునేందుకు సహకరించండి.

- కళత్తూరు, పాతపాళెం రైతులు, కేవీబీపురం మండలం

మా పొలంలో హెచ్చరిక బోర్డు ఎత్తివేయండి

'మాది కేవీబీపురం మండలం పీవీకండ్రిగ గ్రామం. నా పేరు లోకేష్. మా తాత గురవయ్యకున్న 7.8 ఎకరాల వ్యవసాయ భూమిని మా పెద్దనాన్న, మేము ఉమ్మడిగా సాగు చేసుకునేవాళ్లం. ఐదేళ్ల క్రితం పెద్దమనుషుల సమక్షంలో చెరిసగం పంచుకున్నాం. మాకు వచ్చిన భాగం వ్యవసాయ భూమిలో సాగు చేయనివ్వకుండా మా పెద్దనాన్న వీరాస్వామి, ఆయన కుమారుడు ప్రేమ్‌కుమార్ దౌర్జన్యం చేస్తున్నారు. అధికారులను తప్పుదారిపట్టించడంతో మాపొలంలో రెవెన్యూ వారు హెచ్చరిక బోర్డు పెట్టారు. క్షేత్రస్థాయిలో విచారించి మా భూమిలో బోర్డు తొలగించండి. తిరిగి మేము పంటలు సాగు చేసుకోవడానికి సహకరించండి' అంటూ కుటుంబంతో కలిసి ఆయన కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. కలెక్టర్‌కు అర్జీ అందజేయగా పరిశీలిస్తామన్నారు. ఇదే భూవివాదంపై రెండు వారాల క్రితం వీరిపై వీరాస్వామి కుటుంబం వీరిపై ఆరోపణలు చేస్తూ కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ క్యాన్ తీసుకుని తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యకు చేసుకుంటామని బెదిరించిన సంగతి తెలిసిందే.

12గంటల పనివిధానాన్ని రద్దు చేయండి



మన రాష్ట్రంలో పని గంటలను 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నేత విజయకుమార్, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు గంగాదేవి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముగ్గురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ముగ్గురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన పి.మల్లికార్జున అలియాస్ బాలు, ఉల్లి గుణశేఖర్ స్నేహితులు. జులాయిగా తిరిగేవారు. ఈ క్రమంలో తిరుపతికి చెందిన రోహిణి అలియాస్ శ్రీదేవితో వీరికి పరిచయమైంది. ఈమె సహకారంతో ఈనెల 9న తిరుపతికి చెందిన ఓ బాలికను అపహరించి ఆ ఇద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బాలిక ఆచూకీ తెలుసుకుని తల్లితండ్రులకు అప్పగించారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.